


నేటి నుంచి సిఎం జన్మదిన వేడుకలు

అందరూ భాగస్వామ్యం కావాలి : జెడ్‌పి చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

ఈ నెల 21న సిఎం జగన్ జన్మదినం సందర్భంగా సోమవారం నుంచి మూడు రోజులపాటు వేడుకలు నిర్వహిస్తున్నట్లు జెడ్‌పి చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా చేపట్టే వివిధ కార్యక్రమాల్లో జిల్లాలో ప్రజాప్రతినిధులు, పార్టీ శ్రేణులు మమేకం అవ్వాలని కోరారు. సోమవారం గ్రామ, మండల కేంద్రాల్లో వివిధ క్రీడా పోటీలను నిర్వహించాలని, ఇందులో పెద్ద ఎత్తున మహిళలను భాగస్వామ్యం చేయాలని తెలిపారు. 20న మొక్కల నాటే కార్యక్రమంతోపాటు సిఎం జగన్ సుపరిపాలనపై చర్చా వేదికలను గ్రామ, మండల కేంద్రాల్లో ఏర్పాటు చేయాలని చెప్పారు. 21న నియోజకవర్గ కేంద్రాల్లో ఏర్పాటు చేయబోయే రక్తదాన శిబిరాలను విజయవంతం చేయాలని కోరారు.

బాధిత దళితులు



పట్టాదారులను మభ్యపెట్టి, తప్పుడు ధ్రువీకరణ పత్రాలతో దళితులకు ప్రభుత్వం ఇచ్చిన భూమిని స్వాహా చేసిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఇందుకోసం సాక్షాత్తూ ఎస్‌సి కార్పొరేషన్ అధికారుల అవతారమెత్తి, చివరికి రుణాల పేరిట బ్యాంకుకు బదులు రిజిస్ట్రేషన్ కార్యాలయానికి తీసుకెళ్లి ముగ్గురు వ్యక్తుల పేరున మొత్తం భూమి రాయించుకున్నారు. ఒక సామాజిక కార్యకర్త సుదీర్ఘ పోరాట ఫలితంగా ఈ భూబాగోతం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. విషయం తెలుసుకున్న బాధితులు విజయనగరంలోని ఎస్‌సి కార్పొరేషన్ అధికారులను ఆశ్రయించి, తమకు న్యాయం చేయాలంటూ విజ్ఞప్తి చేశారు. బాధితులు, సామాజిక కార్యకర్త సేకరించిన వివరాల ప్రకారం...

- ఎస్‌సి కార్పొరేషన్ ముసుగులో నోటీసులు
- బ్యాంకు రుణాలు ఇప్పిస్తామంటూ రిజిస్ట్రేషన్ ఆఫీసులో బురిడీ
- సామాజిక కార్యకర్త చొరవతో వెలుగులోకి
- అధికారులను ఆశ్రయించిన బాధితులు

తప్పుడు ధ్రువపత్రాలతో..

దళితుల భూములు స్వాహా

ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి / వేపాడ

వేపాడ మండలం చామలాపల్లికి చెందిన కుంచి రాములమ్మ, జలగడుగుల పైడమ్మ, కాటపల్లి గౌరమ్మ, తాలాడ సాదెమ్మ సహా 12 దళిత నిరుపేద కుటుంబాలకు అదే రెవెన్యూ పరిధిలోని 56/4, 60/1, 60/10, 60/14, 80/2, 81/1 తదితర సర్వే నంబర్లలోని 24.22 ఎకరాల మెట్టు, పల్లపు భూములను 1997లో అప్పటి ప్రభుత్వం ఎస్‌సి కార్పొరేషన్ ద్వారా కొనుగోలు చేసి ఇచ్చింది. దాదాపు అంతా ఒకే చోట ఉండడంతో సాగునీటి అవసరాల నిమిత్తం జవహర్ రోజ్‌గార్ పథకం కింద 1998లో సామాజిక వ్యవసాయ బావి నిర్మాణం కోసం రూ.27,200 మంజూరు చేసింది. చాలా కాలం సంబంధిత దళితులు వేరుశనగ, గోగు, వరి తదితర పంటలు సాగు చేసుకుంటూ జీవనం వెల్లదీశారు. అనంతర కాలంలో బావి పూర్తిగా పాడవడం, నీటి వసతి లేకపోవడం, ప్రత్యామ్నాయ నీటి వనరులకు సహకరించే నాథులు కరువవడం వంటి కారణాల వల్ల సేద్యం కష్టతరంగా మారింది.

పక్కా ప్రణాళికతో..

పంట సాగుకు అవకాశం లేక దళిత కుటుంబాలు తీవ్రమైన ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న రోజులవి. దీనికితోడు దళితులంతా నిరక్షరాశులు. కనీసం ఆయా కుటుంబాల్లో ఒక్కరంటే ఒక్కరూ అక్షర జ్ఞానం తెలిసినవారు లేదు. దీన్ని ఆసరాగా చేసుకున్న ఓ పెత్తందారుడి కళ్లు ఈ భూమిపై పడ్డాయి. ఇద్దరు వ్యక్తుల సాయంతో ఎలాగైనా ఆ భూమిని వశపర్చుకునేందుకు పథకం రూపొందించారు. అనుకున్నదే తడువుగా ఎస్‌సి కార్పొరేషన్ అధికారుల అవతారం ఎత్తి, వారి తరపున ప్రభుత్వం నుంచి తీసుకున్న భూమికి డబ్బులు చెల్లించాల్లి ఉందంటూ నోటీసులు పంపడం, ఆ మరుసటి రోజే సూటు, బూటు వేసుకుని కారులో నేరుగా దళితవాడకు వెళ్లి డబ్బులు డిమాండ్ చేయడం వంటి నాటకీయత ప్రదర్శించేవారు. ఇలా కొంతకాలం గడిచాక.... డబ్బులు కట్టకపోతే ప్రభుత్వం తిరిగి స్వాధీనం చేసుకుంటుందని ఓ పక్క బెదిరింపులు, మరోవైపు అదే భూమిపై బ్యాంకు రుణాలు తీసుకుని చెల్లించడం మంచిదంటూ సలహాలు ఇవ్వడం మొదలుపెట్టారు. చివరికి బ్యాంకు రుణాల పేరిట 11 మంది రైతుల్ని కొత్తవలస రిజిస్ట్రేషన్ కార్యాలయానికి తీసుకెళ్లి కొట్టా కాశీవిశ్వనాథం సహా అదే కుటుంబానికి చెందిన మరో ఇద్దరి పేరున సుమారు 22 ఎకరాల భూమిని 2006లో రిజిస్ట్రేషన్ చేయించారు. ఈ మేరకు పట్టాదారులు, వారి కుటుంబ సభ్యులు కాటపల్లి నూక రత్నం, రాముడమ్మ తదితరులు 'ప్రజాశక్తి' ఎదుట ఆవేదన వ్యక్తం చేశారు.

స.హ చట్టం దరఖాస్తుతో..

దళితులను క్రమంగా ఆయా భూముల్లోకి రానీయకుండా చేయడంతో ఇదే మండలానికి చెందిన ఓ సామాజిక కార్యకర్త ఆరా తీశారు. నాటి నుంచి నేటి వరకు సమాచార హక్కుచట్టం ప్రకారం వివరాలు సేకరించడంతో బండారం బయటపడింది. భూ యజమానులను మభ్యపెట్టి, తప్పుడు ధ్రువీకరణ పత్రాలతో రిజిస్ట్రేషన్ చేయించుకున్నట్టు తేలింది. వాస్తవానికి సామాజిక కార్యకర్త ఫిర్యాదు మేరకు 2015లో అప్పటి కలెక్టర్ ఎంఎం నాయక్ విచారణకు ఆదేశించారు. అప్పటి ఎస్‌సి కార్పొరేషన్ ఇడి రాజు సంబంధిత గ్రామాన్ని సందర్శించి విచారణ చేపట్టారు. ఆ తరువాత ఆ నివేదికలన్నీ బుట్టదాఖలయ్యాయి.



ఎస్‌సి కార్పొరేషన్ అధికారులకు సమస్యను వివరిస్తున్న బాధిత దళితులు

క్రయవిక్రయాలకు అవకాశం లేకున్నా..

బాధితులు, వారితరపున సామాజిక కార్యకర్త కీలక సమాచారం సేకరించడంతో పూర్తి బండారం బయటపడింది. ప్రభుత్వ నిబంధనల ప్రకారం ఎస్‌సి కార్పొరేషన్ ద్వారా దళితులకు ఇచ్చిన భూమిని వారు విక్రయించుకోవడానికి గానీ, ఇతరులు కొనుగోలు చేయడానికి గానీ వీల్లేదు. వంశపారంపర్యంగా దానిపై జీవనం సాగించే హక్కుమాత్రమే ఉంటుంది. కానీ, ఆక్రమణదారులు ఈ భూమిని జిరాయితీ భూమిగా చిత్రీకరించి రిజిస్ట్రేషన్ చేయించుకున్నారు. ఈ వ్యవహారంలో కార్పొరేషన్‌లో పనిచేసిన అప్పటి అధికారులు కూడా చేతులు కలిపారన్న అనుమానాలు వ్యక్తమౌతున్నాయి. ఈ నేపథ్యంలో బాధితులంతా కలిసి ఎస్‌సి కార్పొరేషన్ అధికారులను శనివారం కలిసి, తమకు న్యాయం చేయాలంటూ విన్నవించారు.

నేను ఎవరికీ భూమి అమ్మలేదు



నేను ఎవరికీ భూమి అమ్మలేదు. సుమారు 16 ఏళ్ల క్రితం ఒకరిద్దరు వ్యక్తులు మా వద్దకు వచ్చి ప్రభుత్వం నుంచి భూమి తీసుకున్నందుకు డబ్బులు చెల్లించాలంటూ పదేపదే వేధించేవారు. చివరికి వారే బ్యాంకు రుణాలు ఇప్పిస్తామంటూ తీసుకెళ్లారు. తరువాత మా చేతికి చిల్లిగవ్వ కూడా ఇవ్వలేదు. డబ్బులు గురించి అడిగితే ప్రభుత్వానికి చెల్లించేశామని చెప్పారు. తీరా, ఇప్పుడేమో మా భూములు కాశీవిశ్వనాథం, ఆయన కుటుంబ సభ్యులకు విక్రయించినట్టుగా రికార్డులో ఉంది. మాకు చదువు రాకపోవడంతో ఇంతటి అన్యాయానికి ఒడిగట్టారు. మాకు న్యాయం చేయాలి.

– మట్టా రాముడమ్మ, బాధితురాలు

కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ ఉద్యోగుల సమస్యలపై

26న చలో కలెక్టరేట్

ప్రజాశక్తి-విజయనగరం టౌన్



చలో కలెక్టరేట్ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న నాయకులు

కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ ఉద్యోగుల సమస్యలపై ఈ నెల 26న చలో కలెక్టరేట్ కార్యక్రమం చేపడుతున్నట్లు ఎపి కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ ఉద్యోగుల ఫెడరేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి బి.కాంతారావు, ఉపాధ్యక్షులు పి.దుర్గారావు తెలిపారు. స్థానిక ప్రజాసంఘాల భవనంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో వారు మాట్లాడారు. పాదయాత్రలో సిఎం జగన్ ఇచ్చిన హామీ ప్రకారం కాంట్రాక్టు ఉద్యోగులను రెగ్యులరైజ్ చేయాలన్నారు. అవుట్ సోర్సింగ్ ఉద్యోగులకు సమాన పనికి సమాన వేతనం అమలు చేయాలని డిమాండ్ చేశారు. జిఒ 40 ప్రకారం సమగ్ర శిక్ష, కెజిబివి, నేషనల్ హెల్త్ మిషన్‌లో పనిచేస్తున్న కాంట్రాక్టు ఉద్యోగులకు జీతాలు పెంచాలన్నారు. హెల్త్ కార్డులు ఇవ్వాలని కోరారు. రాష్ట్ర ప్రభుత్వం చిరుద్యోగులను తొలగించాలనే ఆలోచన విరమించుకోవాలన్నారు. సమాన పనికి సమాన వేతనం అమలు చేయాలని, కాంట్రాక్టు ఉద్యోగులను రెగ్యులర్ చేయాలని డిమాండ్ చేశారు.

62 ఏళ్లకు వయోపరిమితి పెంచాలని కోరారు. ఈ సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లేందుకు చలో కలెక్టరేట్ కార్యక్రమం చేపడుతున్నట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని వారు పిలుపునిచ్చారు.

అథ్లెటిక్స్‌లో జైభీమ్‌కు రజతం

ప్రజాశక్తి-బొబ్బిలి



రజత పతకం అందుకుంటున్న ఎస్ఇబి సిఐ జైభీమ్

నెల్లూరులో ఈ నెల 16న జరిగిన రాష్ట్ర స్థాయి అథ్లెటిక్స్ పోటీలలో ఎస్ఇబి సిఐ ఆర్.జైభీమ్ రజత పతకం సాధించారు. ఐదు కిలోమీటర్ల రేస్ వాకింగ్‌లో 40 ఏళ్ల పైవిభాగంలో ద్వితీయ స్థానంలో నిలిచారు. 2023 ఫిబ్రవరిలో పశ్చిమబెంగాల్‌లో జరిగే జాతీయ స్థాయి అథ్లెటిక్స్ పోటీలకు అర్హత సాధించారు. జైభీమ్‌ను పట్టణ ప్రముఖులు అభినందించారు.

సబ్ జూనియర్ వాలీబాల్ జట్టు ఎంపిక

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

జిల్లా సబ్‌జూనియర్ వాలీబాల్ జట్టు ఎంపిక పూర్తయింది. ఆదివారం స్థానిక రాజీవ్ క్రీడా ప్రాంగణంలో చేపట్టిన ఎంపికలకు నలుమూలల నుంచి బాలికలు 40 మంది, బాలురు 80 మంది వరకు హాజరయ్యారు. జిల్లా అధ్యక్షులు కృష్ణంరాజు, కెవిఎన్ రాజు, సూరిబాబు ఎంపిక చేపట్టారు. ఈ నెల 23 నుంచి యలమంచిలిలో జరిగే పోటీల్లో పాల్గొంటారు.

యోగా పోటీలు ప్రారంభం



యోగా పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ ఆధ్వర్యంలో జిల్లా స్థాయి యోగా పోటీలు ఉత్సాహంగా ప్రారంభమయ్యాయి. ఆదివారం స్థానిక రాజీవ్ క్రీడా ప్రాంగణంలోని ఇండోర్ స్టేడియంలో ఈ పోటీలను చీఫ్ కోచ్ అప్పలనాయుడు ప్రారంభించారు. శాప్ ఆదేశాల మేరకు యోగా పోటీలు నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. విజేతలుగా నిలిచిన వారిని రాష్ట్ర స్థాయి పోటీలకు పంపిస్తామని చెప్పారు. పోటీలను ఉపాధ్యాయులు బమ్మిడి సన్యాసిరావు, సఖినేటి రవికుమార్ వర్మ, పైడిరాజు, భారతి, స్వాతి నిర్వహించారు.

27న పిసిసి అధ్యక్షులు రుద్రరాజు రాక

ప్రజాశక్తి-విజయనగరంకోట

ఈ నెల 27న పిసిసి అధ్యక్షులు గిడుగు రుద్రరాజు జిల్లా పర్యటనకు వస్తున్నట్లు డిసిసి అధ్యక్షులు ఎస్.రమేష్ కుమార్ తెలిపారు. ఆదివారం స్థానిక కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. 27న ఉదయం 10 గంటలకు జిల్లాలోని ఏడు నియోజకవర్గాల నాయకుల పరిచయం కార్యక్రమం ఉంటుందన్నారు. అనంతరం విలేకరులతో రుద్రరాజు మాట్లాడతారని, 12 గంటలకు బహిరంగ సభ నిర్వహిస్తున్నామని చెప్పారు. మధ్యాహ్నం మూడు గంటల నుంచి నియోజకవర్గాల వారీగా నాయకులతో ముఖాముఖీ సమావేశం నిర్వహిస్తారని వెల్లడించారు. సమావేశంలో కాంగ్రెస్ పార్టీ పట్టణ నాయకులు సుంకర సతీష్ కుమార్, మైనార్టీ సెల్ జిల్లా నాయకులు మహమ్మద్ హసన్ షరీఫ్ పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న డిసిసి అధ్యక్షులు రమేష్‌కుమార్



పవన్ కల్యాణ్‌తో గురాన అయ్యలు

జనసేనలోకి గురాన

ప్రజాశక్తి-విజయనగరంటౌన్

నగరానికి చెందిన ప్రముఖ వ్యాపారవేత్త గురాన అయ్యలు ఆదివారం జనసేనలో చేరారు. మంగళగిరిలోని జనసేన కార్యాలయంలో ఆ పార్టీ అధ్యక్షులు పవన్ కల్యాణ్ సమక్షంలో చేరారు. గతంలో ప్రజారాజ్యం పార్టీలో యువరాజ్యం విభాగం రాష్ట్ర కార్యదర్శిగా ఆయన పనిచేశారు. కాంగ్రెస్‌లో ప్రజారాజ్యం పార్టీ విలీనం తరువాత వైసిపిలో విజయనగరం జిల్లా సమన్వయకర్తగా అయ్యలు కొంతకాలం పనిచేసి, అనంతరం రాజకీయాలకు దూరంగా ఉన్నారు.

నోటితో మాట్లాడుతూ నోసటితో వెక్కిరించే చందంగా ఉంది... జిల్లాలో అధికార పార్టీ పెద్దల తీరు. నిబంధనల ప్రకారం ధాన్యం కొనుగోలు చేపట్టాలంటూ ఊదరగొడుతూనే, మరోవైపు అక్రమాలకు పాల్పడుతున్న మిల్లర్లకు కొమ్ము కాస్తున్న పరిస్థితి నెలకొంది. ఈ నేపథ్యంలోనే జిల్లాలో ధాన్యం కొనుగోలులో జెసి ఆదేశాలు సైతం బేఖాతరవుతున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఎదురు తిరుగుతున్న అధికారులపై వేటు వేయడం గమనార్హం.



మిల్లర్లకు అండగా పెద్దలు!

- సగానికి పైగా మిల్లులు వారివే
- జెసి ఆదేశాలు సైతం బేఖాతరు
- ఎదురు తిరుగుతున్న అధికారులపై వేటు
- వైసిపి పెద్దల అండతో రెచ్చిపోతున్న మిల్లు యాజమాన్యాలు

ప్రజాశక్తి - జామి

వాస్తవానికి ప్రభుత్వం చెబుతున్నట్లు ఒక్క ధాన్యం గింజ ఆశించకుండా మిల్లర్లు ధాన్యాన్ని కొనుగోలు చేయాలి. కానీ మిల్లర్లు బాహాటంగానే కుదరదని, రైతులు అదనపు కిలోలు చెల్లించాలని కరాఖండిగా చెబుతున్న పరిస్థితి. ఈ నేపథ్యంలో మిల్లర్లను బ్లాక్ లిస్టులో పెట్టి, ధాన్యం కొనుగోలు నుంచి తప్పించాలి. అలా చేయాల్సిన జిల్లా ఉన్నతాధికారులు తెల్లమొహం వేస్తున్నారు. నేరుగా జాయింట్ కలెక్టర్ రంగంలోకి దిగినా, ససేమిరా కుదరదని చెబుతున్న దుస్థితి దాపురించింది. తాజాగా జామి మండలం అన్నంరాజుపేట రైతుల ధాన్యం కొనుగోలు విషయంలో అదే జరిగింది. ప్రభుత్వం చెబుతున్నట్లు ఆర్‌బికెలో ఆ రైతు ధాన్యం కొనుగోలు చేసి, గంట్యాడ మండలం రాధాకృష్ణ రైస్‌మిల్లుకు ట్రక్ షీటుతో ఆరు ట్రాక్టర్లు పంపించారు. కానీ ఆ మిల్లు యజమాని అదనపు ధాన్యం ఇచ్చేవరకు ధాన్యం అన్‌లోడింగ్ చేసే ప్రసక్తే లేదని మొండికేశాడు. ఆ రైతు అధికార పార్టీకి చెందిన గ్రామ సర్పంచ్ కావడంతో విషయాన్ని జెసి మయూర్ అశోక్ వరకు తీసుకెళ్లారు. ఆయన కూడా స్పందించి, ధాన్యం తీసుకోవాలని ఆదేశించినా, అబ్బే తగ్గేదేలేదంటూ రెచ్చిపోయిన పరిస్థితి. చివరికి అదనపు ధాన్యం ఆశించిన దానికి కొంత తగ్గించుకుని దించుకునే పరిస్థితి నెలకొంది. ఈ ఒక్క పరిణామమే కాదు. అదే గంట్యాడ మిల్లర్లకు సంబంధించి జామికి చెందిన సివిల్ సప్లయి డిటిని కస్టోడియన్ అధికారిగా నియమించారు. దీంతో ఆ అధికారి ప్రభుత్వం నిబంధనలు పాటించాల్సిందేనంటూ, రైతుల నుంచి అదనపు ధాన్యం తీసుకోవడం కుదరదని హెచ్చరించారు. అంతే ఆగమేఘాలపై ఆ అధికారిని అక్కడ నుంచి మార్చేశారు. ఆ స్థానంలో ఎస్.కోట మండల డిటిని నియమించారు. అధికారులు ఎంత నిక్కచ్చిగా వ్యవహరించినా, మిల్లర్లు అనుకున్న అదనపు ధాన్యం కరాఖండిగా రైతుల నుంచి లాగేసుకుంటున్న తీరును బట్టి మిల్లర్లకు అండ ఎవరన్నది ఇట్టే అర్థమైపోతుంది.

పెద్దల మిల్లులే

ఉమ్మడి విజయనగరం జిల్లాలో సుమారు 175 మిల్లులు ఉండేవి. ఇందులో జిల్లా మార్పుతో 70 శాతం మిల్లులు మన్యం జిల్లాలోకి వెళ్లాయి. కేవలం 30శాతం మిల్లులు మాత్రమే జిల్లాలో ఉన్నాయి. ఇందులో దాదాపుగా అధికార పార్టీ ఎమ్మెల్యేలు, వారి అనుచరుల మిల్లులు ఎక్కువ. అక్కడక్కడ టిడిపి నాయకులు, మాజీ ప్రజాప్రతినిధులు మిల్లులు కూడా ఉన్నాయి. దీంతో ప్రభుత్వం ఎన్ని చెప్పినా, వాటిని పాటించడం కుదరదని తెగేసి చెబుతున్న పరిస్థితి. ఈ నేపథ్యంలోనే జిల్లాలో జెసి ఆదేశాలు కూడా పట్టించుకోవడం లేదన్న ఆరోపణలు వినిస్తున్నాయి. ఇప్పటి వరకు జరిగిన కొనుగోళ్లలో 90తాతం పైన మిల్లర్లు రైతుల నుంచి అదనపు ధాన్యం గుంజుకున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. మిల్లు వద్ద హమాలీ ఛార్జీలు రైతు చెల్లించనవసరం లేదని అధికారులు చెబుతున్నా, ప్రతి రైతు క్వింటాకు రూ.5 చెల్లించాల్సి వస్తోంది. ఈ నేపథ్యంలోనే జిల్లాలో మిల్లర్లు అధికార పార్టీ అండతో రెచ్చిపోతున్నట్లు ఆరోపణలు బలంగా వినిపిస్తున్నాయి. ఇప్పటికైనా జిల్లా పెద్దలు ఆలోచన చేసి, మిల్లర్లు వెనక్కి తగ్గేలా చేయాలి తప్ప లేదంటే మిల్లర్లు ఆగడాలు అరికట్టడం ఎవరి తరమూ కాదన్నది రైతుల వాదన.

ఎన్‌సిఎస్ చక్కెర పరిశ్రమను

ప్రభుత్వమే స్వాధీనం చేసుకోవాలి : సిపిఎం

ప్రజాశక్తి -సీతానగరం

లచ్చయ్యపేటలోని ఎన్‌సిఎస్ సుగర్ ఫ్యాక్టరీని ప్రభుత్వమే స్వాధీనం చేసుకోవాలని, ఇందుకు రైతులంతా పోరాడాలకు సిద్ధంగా కావాలని సిపిఎం జిల్లా కార్యదర్శి రెడ్డి వేణు పిలుపునిచ్చారు. ఆదివారం ఆయన మండలంలోని రామవరంలో ధాన్యం కొనుగోలు ప్రక్రియను పరిశీలించారు. అనంతరం ఎన్‌సిఎస్ సుగర్ ఫ్యాక్టరీ పరిరక్షణ కోరుతూ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వేణు మాట్లాడుతూ ఫ్యాక్టరీని ఈ ప్రాంతం రైతులను కాపాడాల్సిన బాధ్యత పాలక పక్షం, ప్రతిపక్షంపై ఉందని, అయితే సిఎం జగన్మోహన్ రెడ్డి, ప్రతిపక్షనేత చంద్రబాబు నాయుడు ఇద్దరూ కలిసి యాజమాన్యంతో కుమ్మక్కై చెరుకు రైతులకు తీరని ద్రోహం చేశారన్నారు. ఫ్యాక్టరీని ఎవరికీ తెలియకుండా అమ్మకానికి పెట్టినట్లు వార్తలు వస్తున్నాయని, దీన్ని రైతులు, ప్రజలంతా ఖండించి, కాపాడుకోవడానికి పోరాడాలని పిలుపునిచ్చారు. లచ్చయ్యపేట సుగర్ ఫ్యాక్టరీ వల్ల సీతానగరం, బొబ్బిలి మండలాలతో పాటు, చుట్టుపక్కల 10 మండలాల రైతులు ఆర్థికంగా ఎంతో అభివృద్ధి చెందారని, రైతులు తమ పిల్లలను మంచి చదువులు చదివించుకుని వారికి మంచి భవిష్యత్తును అందించారని అన్నారు. ప్రస్తుతం ఈ ఫ్యాక్టరీని అమ్మేయడానికి నేటి ప్రభుత్వం సిద్ధ పడుతుందని ఆగ్రహం వ్యక్తంచేశారు. రైతులపై చిత్త శుద్ధి ఉంటే సుగర్ ఫ్యాక్టరీ అమ్మకం ఆపాలని డిమాండ్ చేశారు.

ప్రజలకు చేరువగా సంక్షేమ పథకాలు

ఎమ్మెల్యే శంబంగి

ప్రజాశక్తి-బొబ్బిలి

ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలన్నీ ప్రజలకు చేరువవుతున్నాయని ఎమ్మెల్యే శంబంగి వెంకట చినప్పలనాయుడు తెలిపారు. ఆదివారం తెర్లాం మండలం పెరుమాళి గ్రామానికి చెందిన పలువురు మాజీ సర్పంచ్ కె.వెంకట అప్పారావు ఆధ్వర్యాన వైసిపిలో చేరారు. వీరికి స్థానిక ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే శంబంగి వైసిపి కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ వచ్చే ఎన్నికల్లో వైసిపి గెలుపే లక్ష్యంగా పనిచేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వైసిపి బొబ్బిలి మండల అధ్యక్షులు శంబంగి వేణుగోపాలనాయుడు, బాడంగి జెడ్‌పిటిసి పెద్దింటి రామారావు, తెర్లాం నాయకులు గర్భాపు రామారావు, తదితరులు పాల్గొన్నారు.



పొగమంచుతో లైట్లు వేసుకుని వెళ్తున్న ఆర్‌టిసి బస్సు

దట్టంగా పొగమంచు

ప్రజాశక్తి-బొబ్బిలి

బొబ్బిలి పట్టణ, పరిసర ప్రాంతాల్లో ఆదివారం పొగమంచు దట్టంగా కురిసింది. దీంతో చలి తీవ్రత పెరిగింది. ఆదివారం ఉదయం 8.30 గంటల వరకు పొగమంచు కురవడంతో రాకపోకలకు వాహనదారులు, ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. పగటిపూట కూడా లైట్లు వేసుకుని వాహనదారులు రాకపోకలు సాగించారు. మంచు ప్రభావంతో చలి పెరగడంతో వృద్ధులు, చిన్నపిల్లలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు.

ఎన్‌సిఎస్ వద్ద బ్లాక్ మార్కెట్ దందా

ప్రజాశక్తి-విజయనగరం

నగరంలో ఎన్‌సిఎస్ డూల్బీ థియేటర్ వద్ద బ్లాక్‌మార్కెట్ దందా సాగుతోంది. ఒకవైపు ప్రభుత్వం ప్రేక్షకులకు వినోదం అందివ్వాలనే ఉద్దేశంతో సినిమా టిక్కెట్ రేట్లను తగ్గించి ఇవ్వాలని షరతు పెట్టింది. కానీ వాటిని బేఖాతరు చేస్తూ బ్లాక్ మార్కెట్ దందాగాళ్లు సినీ అభిమానుల జేబులు గుల్ల చేస్తున్నారు. అవతార్-2 సినిమా కొత్తగా విడుదలవడం, ఆదివారం వారాంతం కావడంతో ప్రేక్షకుల తాకిడి మిన్నంటింది. సినీ ప్రేక్షకుల అభిమానాన్ని సొమ్ము చేసుకునే ఉద్దేశంతో కొంతమంది వ్యక్తులు బ్లాక్ మార్కెట్ దందాకు తెరదీశారు. అమ్మకానికి టిక్కెట్లు ఉన్నప్పటికీ ముందుగానే హౌస్‌ఫుల్ బోర్డు పెట్టి ప్రేక్షకులను మోసం చేస్తున్నా.. ఇదంతా యాజమాన్యం కనుసన్నల్లోనే సాగుతుందనడంలో ఎటువంటి సందేహమూ లేదు. థియేటర్ యాజమాన్యం తన అనుయాయులతో ఈ బ్లాక్ మార్కెట్ దందాను నడిపిస్తోందని సగటు ప్రేక్షకుడి అనుమానం కలగక మానదు. బ్లాక్ మార్కెట్ దందాపై ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలని అభిమానులు కోరుకుంటున్నారు.

ప్రజాశక్తి
www.prajasakti.com

సత్తాచాటిన బైరిపురం విద్యార్థులు



ఎంపికైన విద్యార్థులతో ఉపాధ్యాయుడు

మెరక ముడిదాం : జిల్లా స్థాయిలో జరిగిన స్కూల్ గేమ్స్‌లో బైరిపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు ప్రతిభ కనబరిచి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైనట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎస్‌ఎస్‌ఆర్ ఆచార్యులు తెలిపారు. ఈ నెల 15వ తేదీన విజయనగరం రాజీవ్ గాంధీ స్టేడియంలో జరిగిన క్రికెట్ అండర్ - 17విభాగంలో పాఠశాలకు చెందిన పదవ తరగతి విద్యార్థి పి. హేమ చంద్రరావు, ఈ నెల 17వ తేదీన జరిగిన అండర్ 14 క్రికెట్ విభాగంలో ఏడవ తరగతి విద్యార్థి పి. దినేష్, 16న పార్వతీపురం ఆర్‌సిఎం పాఠశాలలో జరిగిన అండర్ 17 చెస్ విభాగంలో పదో తరగతి విద్యార్థి ఎస్. చంద్ర శేఖర్ సత్తా చాటి రాష్ట్ర స్థాయికి ఎంపికయ్యారని ఆయన తెలిపారు. గెలిపొందిన విద్యార్థులకు, పీడీ జి. రామారావుకు గ్రామస్తులు, ప్రధానోపాధ్యాడులు, ఉపాధ్యాయులు అభినందనలు తెలిపారు.

పంచాయతీ కార్యదర్శులపై నాయకుల ఒత్తిడి

వేపాడ : మండలంలో 18 గ్రామ సచివాలయంలో పనిచేస్తున్న పంచాయతీ కార్యదర్శుల్లో అధికశాతం కార్యదర్శులు నాయకుల ఒత్తిళ్లపై ఆందోళణ చెందుతున్నారు. కొంత మంది ఒత్తిడిలను తట్టుకోలేక దీర్ఘకాలిక సెలవులు పెట్టేయగా మరికొంత మంది తాత్కాలికంగా సెలవులు పెడుతున్నట్లు తెలిస్తోంది. గ్రామాల్లో వైసిపి నాయకులు రెండు వర్గాలుగా విడిపోయి సిబ్బందిపై ఒత్తిడి తెస్తున్నారు. ముఖ్యంగా సామాజిక పింఛన్ల మంజూరులో కొంత మంది ఇవ్వాలని మరి కొంత మంది ఇవ్వద్దని ఒత్తిడి చేయడంతో కార్యదర్శులు ఇబ్బందులు పడుతున్నారు. నాయకులు ఒత్తిడి తగ్గితే తప్ప పనులు చేయలేమని బహిరంగంగానే చెబుతున్నారు.

'ఎస్‌సి, ఎస్‌టిలకు అండగా ఉంటా'



సమస్యలను అడిగి తెలుసుకుంటున్న గొంప వెంకటరావు

వేపాడ : మండలంలో ఉన్న ఎస్‌టి, ఎస్‌సి కులాలకు తాను ఎల్లప్పుడూ అండగానే ఉంటానని టిడిపి మండల అధ్యక్షులు గొంప వెంకటరావు అన్నారు. ఆదివారం తన నివా సంలో మండలానికి చెందిన పులువురు ఎస్‌సి, ఎస్‌టి కులాలకు చెందిన కుటుంబాలు ఆయన్ను కలిసి తమ సమస్యలను వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తాను అధికారంలో లేకపోయినా తనను నమ్మి ఇంత దూరం వచ్చిన ఎస్‌సి, ఎస్‌టి కులాలకు చెందిన వారి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. ఎవరికి ఏ సమస్య ఉన్నా మీ తరుపున పోరాటం చేయడానికి తాను సిద్ధంగా ఉంటానన్నారు.



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న కార్మికులు, నాయకులు

మహాసభను జయప్రదం చేయాలి

నెల్లిమర్ల : ఈ నెల 20, 21 తేదీల్లో అనంతపురంలో జరగనున్న ఎపి మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ (సిఐటియు) 14వ రాష్ట్ర మహాసభలు జయప్రదం చేయాలని మున్సిపల్ వర్కర్స్ ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు కోరారు. ఆదివారం నెల్లిమర్ల నగర పంచాయతీ యూనియన్ నాయకులు రాష్ట్ర మహాసభల పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఎం.దుర్గారావు, జె.శ్రీను, బి.బాలరాజు, బి.రాము, లోకేష్, ఎన్.లక్ష్మణరావు, గౌరీష్ పాల్గొన్నారు.

దేవాలయ ముఖ ద్వారం ప్రారంభం

నెల్లిమర్ల : మొయిద విజయరాంపురంలో నూతనంగా నిర్మించిన వెంకటేశ్వర స్వామి దేవాలయం తూర్పు ముఖ ద్వారాన్ని ఆదివారం ఎమ్మెల్సీ డాక్టర్ పివివి సురేష్‌బాబు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో పెనుమత్స నరసింహరాజు (బుచ్చిబాబు) దంపతులు, గ్రామ సర్పంచ్ అట్టాడ కృష్ణ, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

ముమ్మరంగా వరి నూర్పులు



యంత్రాలతో నూర్పులు వేస్తున్న రైతులు

రేగిడి : మండలంలోని సంకిలి, కొమిరి వెంకటా పురం, తునివాడ, వెంకంపేట తదితర గ్రామాల్లో రైతులు యంత్రాలతో ముమ్మరంగా వరి నూర్పులు చేపడుతున్నారు. కూలీలు కొరత కారణంగా వరి నూర్పులు యంత్రాలకు అధిక నగదు చెల్లించి వరి నూర్పులు చేపడుతున్నట్లు వెల్లడించారు. వాతావరణం మార్పులు కారణంగా మరికొన్ని గ్రామాల్లో వరి నూర్పులు మందకోడిగా జరుగుతున్నాయని రైతులు చెబుతున్నారు. పూర్తిస్థాయిలో రైతు భరోసా కేంద్రాలలో ధాన్యం కొనుగోలు చేస్తే మరింత వరి నూర్పులు ఊపందుకోవచ్చునని రైతులు చెబుతున్నారు.

మాతృభాషపై మక్కువ కల్పించేలా సుపథ



విద్యార్థులతో నిర్వాహకులు

శృంగవరపుకోట : భారతీయ సంస్కృతి, సంప్రదాయాల పరిరక్షణ, మాతృభాషపై మక్కువ కల్పించే దిశగా సుపథ స్వచ్ఛంద సేవా సంఘం కృషి చేస్తుందని యువిఏఎస్ రాజు మాస్టర్ తెలిపారు. సుపథ సోదర బృందం ఆధ్వర్యంలో ఆదివారం పట్టణంలోని ప్రభుత్వ జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాలలో సుపథ ప్రతిభా పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఒకటి నుండి 10వ తరగతి వరకు విద్యార్థులను ప్రాథమిక స్థాయి, ప్రాథమికోన్నత స్థాయి, ఉన్నత స్థాయిలుగా విభజించి పద్య పఠనము, శ్లోకపఠనం, దేశభక్తి గేయాలు, వ్యాసరచన, ప్రశ్నోత్తర రామాయణం, క్విజ్ పోటీలు నిర్వహించామన్నారు. ఈ పోటీలలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులు అందజేశామని అన్నారు.

కోకరిక్యులర్ యాక్టివిటీస్‌తో చురుకుదనం



విద్యార్థిని అభినందిస్తున్న అనిల్ శర్మ

శృంగవరపుకోట : కో కరిక్యులర్ యాక్టివిటీస్‌తో పిల్లల్లో చురుకుదనం, నైపుణ్యం కలుగుతుందని ఒకినోవా కరాటే అసోసియేషన్ అంతర్జాతీయ గోల్డ్ మెడలిస్ట్ అనిల్ శర్మ అన్నారు. ఆదివారం పట్టణంలోని కౌముది గ్లోబల్ స్కూలు ప్రధానోపాధ్యాయులు శాంతి మెహంతి ఆధ్వర్యంలో కోచ్ శ్రీనివాసరావు అధ్యక్షతన నిర్వహించిన కరాటే బెల్ట్ రీడింగ్ టెస్ట్‌లో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇటువంటి కార్యక్రమాల వల్ల పిల్లల్లో చురుకుదనం నైపుణ్యం, కలుగుతుందని అన్నారు. ఇటువంటి కార్యక్రమాలు నిర్వహించడం పట్ల పాఠశాల ప్రధానోపాధ్యాయని శాంతి మెహంతి ని అభినందించారు. ఈ కార్యక్రమంలో ఒకినోవా కరాటే అసోసియేషన్ నుండి డి. భరత్ వర్మ, ఎం. దేవానందన్, విఎన్‌డి. ప్రవీణ్, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ఆరోగ్యశ్రీ బకాయిలేవి..?

- బాడంగి సిహెచ్‌సికి ఇవ్వని సొమ్ములు
- ఆస్పత్రిని వేధిస్తున్న మందుల కొరత
- అరకొర మందులతో రోగులకు అవస్థలు

ప్రజాశక్తి-బొబ్బిలి, బాడంగి

కార్పోరేట్ ఆసుపత్రులకు ఆరోగ్యశ్రీ బిల్లులు విడుదల చేస్తున్న ప్రభుత్వం బాడంగి ప్రభుత్వ ఆసుపత్రికి మాత్రం ఆరోగ్యశ్రీ బిల్లులు విడుదల చేయడం లేదు. జిల్లాలో ఉన్న మిగతా ప్రభుత్వ ఆసుపత్రులకు విడుదల చేస్తున్నా బాడంగి ఆసుపత్రిపై మాత్రం జాలి చూపడం లేదు. దీంతో ఇక్కడ నిధులు కొరత వేధిస్తుంది. ఆరోగ్యశ్రీ బిల్లులు ఇవ్వకపోవడంతో పాటు మందులు కూడా సంపూర్ణంగా సరఫరా చేయకపోవడంతో ఆసుపత్రికి వస్తున్న రోగులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.



ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న రోగులు

రూ.20లక్షలు బకాయి

బాడంగి ప్రభుత్వ ఆసుపత్రిలో ఆరోగ్యశ్రీ కింద శస్త్ర చికిత్సలు చేస్తున్నారు. నాడు టిడిపి, నేడు వైసిపి హయాంలో ఆరోగ్యశ్రీ బిల్లులు చెల్లించ లేదు. రోగుల ఖర్చుల నిమిత్తం కేటాయిస్తున్న డబ్బులు మాత్రం రోగుల బ్యాంకు ఖాతాలకు జమ చేస్తున్న ప్రభుత్వం ఆసుపత్రికి చెల్లించాల్సిన బిల్లులు మాత్రం చెల్లించడం లేదు. 2019 నుంచి ఆరోగ్యశ్రీ కింద 327మందికి ఈ ఆస్పత్రిలో శస్త్ర చికిత్సలు చేశారు. వీటికి రూ.20లక్షలు వరకు ప్రభుత్వం చెల్లించాల్సి ఉన్న చెల్లించడం లేదు. పక్కనే ఉన్న బొబ్బిలి ఆసుపత్రికి నిధులు చెల్లిస్తున్న ప్రభుత్వం బాడంగి ఆసుపత్రికి ఎందుకు చెల్లించడం లేదని పలువురు ప్రశ్నిస్తున్నారు.

అరకొర మందులతో అవస్థలు

ప్రభుత్వ ఆసుపత్రికి ప్రభుత్వం అరకొర మందులు పంపిణీ చేయడంతో వైద్యులు, రోగులు తీవ్ర అవస్థలు పడుతున్నారు. అవసరమైన మందులకు ప్రతిపాదనలు చేస్తే 20శాతం మందులు కూడా సరఫరా చేయడం లేదని తెలుస్తోంది. అరకొర మందులు సరఫరా చేయడంతో రోగులకు నాణ్యమైన వైద్య సేవలు అందడం లేదని విమర్శలు వస్తున్నాయి. మందులు కొరత వేధించడంతో రోగులు బొబ్బిలి, రామభద్రపురం, సాలూరు, రాజాంలలో ప్రైవేట్ ఆసుపత్రిలను ఆశ్రయించి చికిత్స పొందేందుకు ఆసక్తి చూపుతున్నారు. హెచ్‌డిఎస్ నిధులను కూడా ప్రభుత్వం సంపూర్ణంగా ఇవ్వడం లేదు. గతంలో హెచ్.డి.ఎస్ నిధులను ప్రభుత్వం వెనక్కి తీసుకుంది. నిధులు, మందులు కొరతతో అటు వైద్యులు, ఇటు రోగులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ప్రభుత్వం స్పందించి ఆరోగ్యశ్రీ బిల్లులు, హెచ్.డి.ఎస్ నిధులు, మందులు ఇవ్వాలని రోగులు కోరుతున్నారు.



బాడంగి సిహెచ్‌సి

నేడు మడ్డువలస నీరు విడుదల

వంగర : మండలంలోని గొర్లె శ్రీరాముల నాయుడు మడ్డువలస ప్రాజెక్టు దిగివను ఉన్న ఆయకట్టుకు కుడి, ఎడమ కాలువల ద్వారా సోమవారం ఉదయం 11 గంటలకు సాగునీరు విడుదల చేస్తామని ప్రాజెక్టు ఎఇ కె.నితిన్ కుమార్ తెలిపారు. వంగర, రేగిడి, సంతకవిటి శ్రీకాకుళం జిల్లాలోని జి.సిగడాం మండలల్లో పదివేల ఎకరాలకు రబి సీజనకు సంబంధించి ఆరుతడి పంటలకు సాగునీరు అందిస్తామని అన్నారు.

మొయిదలో మేలుకొలుపు

నెల్లిమర్ల : మండలంలోని మొయిద విజయరాంపురంలో మేలు కొలుపు కార్యక్రమాన్ని ఆదివారం ధనుర్మాసం సంధర్భగా గ్రామస్థులు నిర్వహించారు. ఈ సంధర్భంగా వారు మట్లాడుతూ మేలుకొలుపు పాటలు నిద్రమత్తులో పడి పెద్దవారి మాటలను వినిపించుకోని పిల్లలు, పొద్దున్నే లేవడానికి బద్దకించే పెద్దల కోసమే ఉపయోగపడతాయన్నారు. జానపదుల కాలం నుండి అన్నమయ్య వరకు ఎందరో కవులు ఈ మేలుకొలుపు పాటలకు మెరుపులద్దారని, వాటిలో పేరుకు భగవంతుడి ప్రస్తావన వున్నా రేపటి మనిషికి మేలుకొలుపు పాడే గీతాలను ధనుర్మాసం ప్రారంభం నుండి నెల రోజులు పాటు జరిపి భోగి రోజున అన్నదాన కార్యక్రమంతో మేలు కొలువు ముగుస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో మొయిద విజయరాంపురం భక్త రామ బృందం వారు పాల్గొన్నారు.

పరిశుభ్రతపై ర్యాలీ

పాలకొండ : క్లీన్ ఆంధ్రప్రదేశ్ కార్యక్రమంలో భాగంగా పరిశుభ్రతపై స్థానిక ఆర్టీసీ కాంప్లెక్స్ నుంచి కార్గిల్ జంక్షన్ వరకు భారీ అవగాహన ర్యాలీ నిర్వహించారు. కార్గిల్ సెంటర్ వద్ద మానవహారం నిర్వహించారు. శానిటేషన్‌పైకమిషనర్ సామంచి సర్వేశ్వరరావు ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్ మాట్లాడుతూ మన చుట్టూ ఉండే పరిసర ప్రాంతాన్ని పరిశుభ్రంగా ఉంచుకోవాలని, పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకుంటే వ్యాధుల నుంచి దూరంగా ఉండవచ్చు అన్నారు. కార్యక్రమంలో నగర పంచాయతీ చైర్‌పర్సన్ యందవ రాధాకుమారి, కౌన్సిలర్లు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

గ్రామాల్లో 'ఇదేం కర్మ రాష్ట్రానికి'

ప్రజాశక్తి- డెంకాడ

మండలంలోని పేడాడ గ్రామంలో ఆదివారం మాజీ ఎంపిపి కంది చంద్రశేఖర్ ఆధ్వర్యంలో ఇదేమి కర్మ మన రాష్ట్రానికి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికి తిరిగి ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి పతివాడ నారాయణస్వామినాయుడు మాట్లాడుతూ వైసిపి ప్రభుత్వంలో సామాన్య ప్రజలపై దాడులు పెరిగాయన్నారు. ప్రశ్నించిన వారిపై దాడులు చేయడమే కాకుండా అక్రమ కేసులు బనాయించి ఇబ్బందులకు గురిచేస్తున్నారన్నారు. ఈ ప్రభుత్వాన్ని గద్దె దించేందుకు అందరూ కలిసి కట్టుగా ముందుకు రావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు తారక రామానాయుడు, సంఘం సురేష్, బాస్కర్, బొండా రవి కిరణ్, శేషగిరి తదితర పాల్గొన్నారు.



డెంకాడ: ర్యాలీ చేస్తున్న టిడిపి నాయకులు

నెల్లిమర్ల: మండలంలోని గొర్లిపేట, సీతారామునిపేటలో ఇదేమీ కర్మ మన రాష్ట్రానికి కార్యక్రమాన్ని ఆదివారం టిడిపి మండల పార్టీ అధ్యక్షులు కడగల ఆనంద్ కుమార్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సంధర్భంగా టిడిపి నాయకులు, కార్యకర్తలు వీధుల్లో పర్యటించి అధికార వైసిపి అవినీతి అక్రమాలను ఎండగట్టి ప్రచారం చేశారు. అనంతరం మండల పార్టీ అధ్యక్షులు కడగల ఆనంద్ కుమార్, సీనియర్ నాయకులు సువ్వాడ రవిశేఖర్, జిల్లా అధికార ప్రతినిధి గేదెల రాజారావు మాట్లాడుతూ ప్రచార ఆర్భాటం తప్ప అధికార వైసిపి చేసిందేమీ లేదన్నారు. సంక్షేమ పథకాలు పేరిట ప్రజలను మభ్యపెట్టి అభివృద్ధి పనులు చేయడం లేదని విమర్శించారు. ఈ కార్యక్రమంలో టిడిపి ఎస్‌సి సెల్ రాష్ట్ర అధికార ప్రతినిధి పోతల రాజప్పన్న, మండల తెలుగు యువత అధ్యక్షులు నల్లం శ్రీనివాసరావు, నాయకులు తాడ్డి సత్య నారాయణ, దన్నాన రామ్మూర్తి తదితరులు పాల్గొన్నారు.




నెల్లిమర్ల: ప్రచారం చేస్తున్న టిడిపి నాయకులు

జరజాపుపేటలో రక్త దానం

ప్రజాశక్తి - నెల్లిమర్ల

నెల్లిమర్ల నగర పంచాయతీ పరిధిలోని జరజాపుపేటలో కీర్తిశేషులు అవనాపు సూర్యనారాయణ, మద్దిల ఆదినారాయణ జ్ఞాపకార్థం మురళీకృష్ణ బ్రదర్స్ రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. ఆదివారం స్థానిక టివిఆర్ కళ్యాణ మండపంలో జరజాపుపేట సాధన యువజన సంఘం ఆధ్వర్యంలో ఈ రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ పెనుమత్స సురేష్ బాబు రక్తదాన శిబిరాన్ని ప్రారంభించారు. ఎమ్మెల్సీ సురేష్‌బాబు మాట్లాడుతూ కీర్తి శేషువు అవనాపు సూర్య నారాయణ, మాజీ ఉప సర్పంచ్ మద్దిల ఆదినారాయణ జ్ఞాపకార్థం అవనాపు మురళీ బ్రదర్స్ రక్త దానం శిబిరం నిర్వహించడం హర్షణీయమని కొనియాడారు. యువత సేవా కార్యక్రమాలకు ముందుకు రావాలని పిలుపునిచ్చారు. సమాజం హితం కోరే ఇటువంటి కార్యక్రమాల్లో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని కోరారు. అనంతరం రక్త దాత సాధన యువజన సంఘం సభ్యులు మద్దిల రాంబాబుని ఎమ్మెల్సీ ఘనంగా సత్కరించారు. కాగా శిబిరంలో 25 మంది రక్తదానం చేశారు. ఈ కార్యక్రమంలో వైస్ చైర్మన్ సముద్రపు రామారావు, కౌన్సిలర్ అవనాపు సత్య నారాయణ, నాగ వంశం డైరెక్టర్ మద్దిల వాసు, నల్లి శ్రీను, మద్దిల శ్రీనివాసరావు, ఎంఎం నాయుడు, ఉపాధ్యాయులు ఎం.సన్యాసిరావు, సుంకర మోహన్, సీతారాం, ఎం.సత్యనారాయణ, సాధన యువజన సంఘం ప్రతినిధులు పోలుబోతు దుర్గాప్రసాద్, పసుమర్త వెంకట రమణ తదితరులు పాల్గొన్నారు.



రక్తదాతను సత్కరిస్తున్న ఎమ్మెల్సీ సురేష్‌బాబు

రాజకీయ వేధింపులు తగవు

ప్రజాశక్తి- రేగిడి

పాఠశాలల్లో మధ్యాహ్న భోజన పథకంలో పనిచేస్తున్న కార్మికులకు రాజకీయ వేధింపులు, తొలగింపులు లేకుండా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని సిఐటియు జిల్లా కార్యదర్శి సిహెచ్ రామ్మూర్తినాయుడు డిమాండ్ చేశారు. ఆదివారం ఉంగరాడ మెట్ట వద్ద మధ్యాహ్న భోజన పథకం నిర్వాహకులతో ధర్నా నిర్వహించి ఆయన మాట్లాడారు. మధ్యాహ్న భోజన కార్మికులపై గ్రామాల్లో రాజకీయ వేధింపులు జరుగుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. కందిస, లచ్చారాయపురం గ్రామాల్లో రాజకీయ కారణాలతో కార్మికుల మధ్య తగువులు పెట్టి తొలగించే ప్రయత్నం చేస్తున్నారని, అనేక సంవత్సరాలుగా పనిచేస్తున్న వంట కార్మికులను తొలగించే ప్రయత్నం రాజకీయ నాయకులు చేస్తుంటే దానికి మద్దతుగా అధికారులు కూడా సహకరించడం సరైన పద్ధతి కాదని అన్నారు. హైస్కూలులో పనిచేస్తున్న వారికి వేతనం యివ్వాలని, రాజకీయ వేధింపులు ఆపాలని వెల్లడించారు. ప్రమాద బీమా సౌకర్యం కల్పించాలని, రిటైర్మెంట్ బెనిఫిట్స్ ఇవ్వాలని, యూనిఫామ్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో వంట నిర్వాహక సంఘ నాయకులు రవణమ్మ, సరస్వతి, సత్యవతి, లక్ష్మీ, అప్పలకొండ, ఈశ్వరమ్మ పాల్గొన్నారు.




నిరసన తెలుపుతున్న నాయకులు

అడ్డూరివానిపాలెంలో గడపగడపకు..

ప్రజాశక్తి- కొత్తవలస

మండలంలోని అడ్డూరివాని పాలెం గ్రామంలో ఆదివారం గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు ఇంటింటికి వెళ్లి ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు గురించి ఆరా తీశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మునుపెన్నడూ లేని విధంగా జగనన్న పాలనలో అందజేస్తున్న సంక్షేమ పథకాలతో ప్రజలు సుఖంగా ఉన్నారన్నారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు ఒబ్బిన నాయుడు, కొత్తవలస సర్పంచ్ మచ్చా ఎర్రయ్య రామస్వామి, వైస్ సర్పంచ్ పెనగంటి చెల్లయ్య, గొరపల్లి రవి, స్థానిక నాయకులు ఆదిరెడ్డి అప్పన్న(నాయుడు), లెంక వెంకన్న పాత్రుడు, గణేష్, వార్డు సభ్యుడు బాలరాజు, ఆతవ రమేష్ పాల్గొన్నారు.



కరపత్రాలను అందజేస్తున్న ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు

కామన్వెల్త్ విజేతకు ఘనస్వాగతం

ప్రజాశక్తి- బొండపల్లి

న్యూజిలండ్ దేశంలో అంతర్జాతీయ స్థాయిలో గత నెల 24న నుండి డిసెంబరు 4 వరకూ జరిగిన కామన్‌వెల్త్ పవర్ వెయిట్ లిఫ్టింగ్ పోటీల్లో ప్రతిభ కనబరిచి నాలుగు బంగారు పతకాలు సాధించిన చామలవలస గ్రామానికి చెందిన బోదంకి అనిల్‌కుమార్‌కు స్వగ్రామంలో ఆదివారం ఘన స్వాగతం పలికారు. మండల కేంద్రం నుంచి జాతీయ రహదారి మీదుగా ప్రత్యేక వాహనంలో ఊరేగింపుగా తీసుకొచ్చి సత్కరించారు. అనిల్‌కుమార్‌ను ఎంపిపి చల్ల చలంనాయుడు, జెడ్‌పిటిసి రాపాక సూర్యప్రకాశ్‌రావు, ఇండియన్ పవర్ వెయిట్ లిఫ్టింగ్ కోచ్ ఎస్. కోటేశ్వరరావు, ఎపి పవర్ వెయిట్ లిఫ్టింగ్ అసోసియేషన్ అధ్యక్షులు ఎం. ప్రభాకర్‌రావు, శిక్షకులు శ్రీనివాసరావులు అభినందించారు.



అనిల్‌కుమార్‌ను సత్కరిస్తున్న ఎంపిపి, జెడ్‌పిటిసి

ప్రజల్లోకి అంబేద్కర్ ఆశయాలు



సూర్యనారాయణ

వేపాడ : అంబేద్కర్ ఆశయాన్ని ప్రజలకు చేరవేయాలని అంబేద్కర్ వాది, బుద్ధిష్టు సిహెచ్ సూర్యనారాయణ అన్నారు. విద్యావంతులు యువకులు అంబేద్కర్‌ని ఆదర్శంగా తీసుకోవాలన్నారు. ఆయన అందించిన రిజర్వేషన్‌ను వినియోగించుకుని ఉద్యోగాలు పొంది అభివృద్ధి సాధించి ఆదర్శంగా నిలవాలన్నారు. కేవలం అంబేద్కర్ విగ్రహాలకి పూలమాలలు వేయడం, దండాలు పెట్టడంతో సరి పెట్టుకోవద్దని ఒక నెలలో ఏదో ఒక గ్రామాన్ని ఎంచుకుని యువకులు అంబేద్కర్ గూర్చి, బహుజన సమాజ పార్టీ గూర్చి గ్రామాల్లో సమావేశాలు ఏర్పాటు చేసి యువకులను చైతన్య పర్చాలని ఆయన కోరారు.

ప్రకృతి సాగు పరిశీలన

సీతంపేట : మండలంలోని కేసరజోడు పంచాయతీ దిబ్బగూడాలో గిరిజనులు సాగు చేస్తున్న ప్రకృతి వ్యవసాయాన్ని ఎపి సిఎన్ఎఫ్ స్టేట్ రిసోర్స్ పర్సన్ పి.దేవుళ్లు ఆదివారం సందర్శించారు. అనంతరం రైతులతో మాట్లాడారు. వెలుగు ఆధ్వర్యంలో ప్రకృతి వ్యవసాయం చేయడం బాగానే ఉందని, అధిక లాభాలు వస్తాయని తెలిపారు. అరటి పంట సాగు గురించి రైతులు తెలిపారు. జీడిమామిడికి సోకే టిదోమపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో శ్రీనివాసరావు, డైరెక్టర్ సంజీవరావు, నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

హాకీ జట్టుకు స్పోర్ట్స్ కిట్ వితరణ

సీతంపేట : సీతంపేట హాకీ టీంకి దోనుబాయి ఎస్సై కిషోర్ వర్మ ఆదివారం స్థానిక ఎన్టీఆర్ గ్రీన్ ఫీల్డ్ స్టేడియంలో రూ.25వేలు విలువచేసే హాకీ కిట్లును ఉచితంగా అందజేశారు. హాకీ క్రీడాకారులు రాష్ట్ర, జాతీయ స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు.

నేడు వీరఘట్టంలో గడపగడపకు..

వీరఘట్టం : మండల కేంద్రంలోని నాలుగో సచివాలయ పరిధిలో ఈనెల 19న గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించనున్నట్లు మేజర్ పంచాయితీ ఎగ్జిక్యూటివ్ అధికారి వి.రామచంద్రరావు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. సర్పంచి పి.గౌరమ్మ ఆధ్వర్యంలో నిర్వహించనున్న ఈ కార్యక్రమానికి స్థానిక ఎమ్మెల్యే వి.కళావతి, ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్ హాజరుకానున్నారని తెలిపారు. కావున మండల స్థాయి అధికారులు తప్పనిసరిగా హాజరుకావాలని ఆయన కోరారు.

వినోద్ మిశ్రాకు ఘన నివాళి

ప్రజాశక్తి - వీరఘట్టం

మండలంలోని చిన్న ఘోర కాలనీలో ఆదివారం వినోద్ మిశ్రా వర్ధంతి వేడుకలు సిపిఐ ఎంఎల్ లిబరేషన్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పార్వతీపురం మన్యం జిల్లా కార్యదర్శి పి.భాస్కరరావు మాట్లాడుతూ వినోద్ మిశ్రా సేవలను కార్యక్రమంలో పలువురు గిరిజనులు పాల్గొన్నారు.

రాజాం టిడిపిలో గ్రూపుల పోరు

- అగ్ర నాయకుల్లో విభేదాలు..
- 2019 సార్వత్రిక ఎన్నికల నుంచి సీనియర్లలో ముసలం
- మౌనం వీడని కళా వెంకటరావు
- పోరు వీడకుంటే 2024 ఎన్నికల్లోనూ కష్టమే..

ప్రజాశక్తి- రేగిడి

రాజాం నియోజకవర్గంలో రేగిడి, సంతకవిటి, వంగర, రాజాం మండలాలున్నాయి. ఈ నియోజకవర్గంలో ప్రస్తుతం టిడిపి తరఫున మాజీ మంత్రి కోండ్రు మురళీమోహన్, కావలి ప్రతిభా భారతి వీరిద్దరూ విధేయులుగా ఉన్నారు. కొండ్రు మురళి మోహన్‌కు అధిష్టానం రాజాం టిడిపి ఇంచార్జి బాధ్యతలు అప్పగించింది. దీంతో మురళీ, ప్రతిభా భారతి మధ్య సఖ్యత కొరవడింది. అధిష్టానం ఒకరికి ఎమ్మెల్యే సీటు ఇస్తే, రెండో వారు సహకరించకపోవడం వంటి సమస్య ఉంది. దీనికి తోడు రేగిడి మండలం మాజీ ఎంపిపి కిమిడి రామకృష్ణం నాయుడు, మాజీ మండల అధ్యక్షులు కిమిడి వినయ్ కుమార్‌లు కావలి ప్రతిభా భారతికి సపోర్టుగా నిలుస్తున్నారు. 2019 ఎన్నికల్లో అధిష్టానం మాజీ మంత్రి కోండ్రు మురళీమోహన్‌కు టిడిపి ఎమ్మెల్యే టికెట్ ఇచ్చింది. ఈ నేపథ్యంలో ప్రతిభా భారతి వర్గం సహకరించకపోవడంతో ఓడిపోయినట్లు టిడిపి వర్గీయులు చెబుతున్నారు. వీరిద్దరి మధ్య సఖ్యత కోసం సీనియర్ టిడిపి నాయకులు, మాజీ మంత్రి కిమిడి కళా వెంకట్రావు కూడా పట్టించుకోకుండా మౌనం వహించడంతో 2019 సార్వత్రిక ఎన్నికల్లో టిడిపి ఓటమి చెందిందన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. వీరిద్దరి మధ్య మాజీ మంత్రి కళా పంచాయతీ పెట్టకపోవడంతో నేటి వరకు ఎడ మొహం, పెడ మొహంలా ఉన్నారని, ఇప్పటికైనా పంచాయతీ చేయకుంటే 2024 సార్వత్రిక ఎన్నికలకు వైసిపి మరోసారి విజయం సాధించడం ఖాయమని టిడిపి అభిమానులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

'కాపు' కాసేనా.?

ఈ నియోజకవర్గంలో కాపు సామాజిక వర్గానికి చెందిన ఓట్లు ఎక్కువ శాతం ఉన్నాయి. మాజీ మంత్రి కళా వెంకట్రావు కను సైగలలో రాజాం నియోజకవర్గం ఉండేది. 2014లో రాజాం నియోజకవర్గం ఎమ్మెల్యే ఎస్‌సి రిజర్వేషన్ అయింది. దీంతో కాంగ్రెస్ తరపున కోండ్రు మురళీమోహన్, టిడిపి తరపున కావలి ప్రతిభా భారతి, వైసిపి తరపున కంబాల జోగులు పోటీ చేశారు. తక్కువ మెజార్టీతో వైసిపి ఎమ్మెల్యే కంబాల జోగులు గెలుపొందారు. అనంతరం చంద్రబాబు నాయుడు సమక్షంలో అమరావతిలో కోండ్రు మురళీమోహన్ టిడిపి తీర్థం పుచ్చుకున్నారు. కొండ్రు పనితనాన్ని మెచ్చుకొని 2019 ఎన్నికల్లో టిడిపి టికెట్‌ను అధిష్టానం ఆయనకు కట్టబెట్టింది. స్థానిక అగ్ర నాయకుల్లో కొండ్రుకు సరైన మద్దతు లేక 24 వేల ఓట్లు మెజార్టీతో వైసిపి నాయకులు కంబాల జోగులు రెండోసారి గెలుపొందారు. 2024 సార్వత్రిక ఎన్నికలకు టిడిపి గెలవాలంటే ముందుగా కావలి ప్రతిభా భారతి, కొండ్రు మురళీమోహన్, కిమిడి వర్గీయులతో పంచాయితీ పెట్టి తేల్చుకోవాలని లేకుంటే టిడిపి భారీ మూల్యం చెల్లించుకోవాల్సి వస్తుందని రాజకీయ విశ్లేషకులు చర్చించుకుంటున్నారు. అయితే పైన పేర్కొన్న ముగ్గురూ ఎస్‌సి సామాజిక వర్గానికి చెందిన వారే కావడంతో ఈ సారి ఈ నియోజకవర్గంలో ఉన్న కాపు ఓటర్లు ఎవరుకు పట్టం కడతారోనన్న చర్చ జరుగుతుంది. వాస్తవానికి కళా వెంకటరావు కలుగు చేసుకుని ఈ పంచాయతీని పరిష్కరించి కాపు ఓటర్లకు ఒక్క విషయం చెబితే టిడిపి విజయం నల్లేరు మీద నడకలా మారిపోతుందని అంచనా వేస్తున్నారు. మరో మూడు రోజుల్లో ఈ నియోజకవర్గంలో చంద్రబాబు పర్యటన ఉన్న నేపథ్యంలో ఇప్పుడు దీనిపై చర్చ జరుగుతోంది.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

గుర్ల : మండలంలో పాలవలస పంచాయతి పరిధిలోని నక్కలపేట సమీపంలో ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి చెందాడు. మృతుడు మున్నా కుమార్ రాయ్ (23) నక్కల పేట నుండి తన బైక్ పై విజయనగరం వైపు వెళుండగా ఆ బైక్‌కు ఉన్న సైడ్ స్టాండ్‌ను తీయకుండా ప్రయాణం చేయడం వల్ల ఆస్టాండు రోడ్డుకు తగిలి బైక్ అదుపు తప్పి ఈ ప్రమాదం సంభవించిందని పోలీసులు తెలిపారు. మృతుడు మున్నా కుమార్ రాయ్ భార్య పల్ల ఆది లక్ష్మి పోలీసులకు ఫిర్యాదు చేశారు. గుర్ల పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృత దేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం చీపురుపల్లి ప్రభుత్వాస్పత్రికి తరలించారు.



మృతి చెందిన మున్నాకుమార్ రాయ్

ఆటో ఢీకొని నలుగురికి గాయాలు

పార్వతీపురంరూరల్ : బైకును ఆటో ఢీకొన్న సంఘటనలో ఒకే కుటుంబానికి చెందిన నలుగురు గాయపడ్డ సంఘటన ఆదివారం చోటు చేసుకుంది. స్థానిక జిల్లా ఆస్పత్రి ఔట్‌పోస్టు పోలీసుల కథనం ప్రకారం ఒడిశాలోని రాయగడ జిల్లా జిమిడిపేటకు చెందిన యడ్ల వెంకటరమణ తన కుటుంబ సభ్యులతో కలిసి పార్వతీపురం బైకుపై వస్తున్నారు. కొమరాడ మండల కేంద్రంలోని గిరిజన ఆశ్రమ పాఠశాల వద్ద ఎదురుగా వస్తున్న ఆటో ఢీకొంది. ఈ సంఘటనలో వెంకటరమణతో పాటు ఆయన భార్య కవిత, కుమారులు హర్షవర్ధన్ (4), చైతన్య (11నెలలు) గాయపడ్డారు. ఈ సంఘటనలో చైతన్య, హర్షవర్ధన్ తీవ్రంగా గాయపడ్డారు. వెంటనే వీరిని స్థానికులు 108లో జిల్లా కేంద్రాసుపత్రికి తరలించారు. ఔట్‌పోస్టు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.